'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

మహానగరాల దాహార్తి

రుతు పవనాల ఆగమనంతో వేసవి తాపం మెల్లమెల్లగా చల్లారి పోతున్నది. కానీ, దేశవ్యాప్తంగా ఈసారి వేసవి సృష్టించిన కడగండ్లను మాత్రం అంత సులభంగా మరచిపోలేం. ఉష్ణతాపంతో పాటుగా నీటి ఎద్దడి విషయంలో చుక్కలు చూపించింది. దక్షిణాదిలో కర్ణాటక ఎదుర్కొన్న నీటి సమస్యలు దేశవ్యాప్తంగా చర్చాంశమయ్యాయి. ముఖ్యంగా రాజధాని బెంగళూరు నీటి కటకటతో విలవిలలాడటం చూశాం. నగరానికి 60 శాతం నీటిని సమకూర్చే కావేరీ బేసిన్‌కు వర్షాభావం వల్ల వరద తగ్గిపోవడమే ఇందుకు కారణం. ధగధగ వెలిగే ఐటీ నగరం నీటి కొరతతో వెల వెల పోవడం చూసి దేశమే నివ్వెరపోయింది. దక్షిణాఫ్రికాలో నీటి కొరత కారణంగా నివాసయోగ్యత కోల్పోతున్న కేప్‌టౌన్ నగరంతో బెంగళూరుకు పోలికలు చెప్పుకోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పట్టింది. అయితే నీటి సమస్య కేవలం కర్ణాటకకో, బెంగళూరుకో పరిమితం కాదు. చెన్నై, కోల్‌కతా నగరాల పరిస్థితి తెలిసిందే. సీజన్ ఆరంభంలో కొంత భయపెట్టినప్పటికీ హైదరాబాద్ పరిస్థితి మాత్రం చాలావరకు మెరుగ్గానే ఉంది. మండే కొలిమి లాంటి వేసవి ఎండలకు దేశ రాజధాని ఢిల్లీలో సైతం ఇలాంటి పరిస్థితే ఎదురైంది. ఇరుగు పొరుగు రాష్ట్రాలతో జల వివాదం ఓ అదనపు జోడింపు. ఢిల్లీ ప్రభుత్వం గత నెల యమునా నదీ జలాల కోసం సుప్రీంకోర్టు గడప తొక్కాల్సి వచ్చింది. 137 క్యూసెక్కుల నీటిని విడుదల చేయమని హిమాచల్‌ప్రదేశ్‌ను, నీటి తరలింపులో తోడ్పడమని హర్యానాను సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించాల్సి రావడం గమనార్హం.

వర్షాభావానికి అంతర్రాష్ట్ర జల వివాదాలు అగ్నికి ఆజ్యంలా తోడవుతున్న పరిస్థితి మనకు కనిపిస్తున్నది. ఇంకా అనేక అంశాలు నగరాల నీటి సమస్యలకు కారణమవుతున్నాయి. అందులో ముఖ్యమైనవి అడ్డూ అదుపూ లేని పట్టణీకరణ, అసమర్థ జల నిర్వహణ, భూగర్భ జలాల అతి వినియోగం, అడవుల నరికివేత, చాలీచాలని నీటి సరఫరా, మురుగునీటి శుద్ధి వ్యవస్థలు. అడవులు తగ్గిపోవడం వల్ల భూతాపం పెరిగిపోయి రుతువులు గతి తప్పుతున్నాయి. అతి వృష్టి అనావృష్టి దాగుడు మూతలు ఆడుతున్నాయి. వానలు ఎక్కువగా కురిసినప్పుడు నీరు సముద్రంలోకి పోతుంది. తక్కువ వర్షపాతం నమోదైన పరిస్థితుల్లో ఎండలు మండితే ఉపరితల, భూగర్భ జలాలు ఇంకిపోయి నీటికి ఇక్కట్లు తప్పడం లేదు. ఇదంతా ఒక గొలుసుకట్టు చర్యలా లేదా విష వలయంలా తయారైంది.

ఈ సమస్యకు పైపై మెరుగుల పరిష్కారాలు పనిచేయవు. దీర్ఘకాలిక పరిష్కారం మాత్రమే సమస్య నుంచి బైటపడేస్తుంది. ఓం ప్రథమంగా చేయాల్సింది జలవనరుల లెక్కలు తేల్చి పట్టణీకరణ వాటిపై దురాక్రమణ జరుపకుండా చూడటం. ఆ తర్వాత చేయాల్సింది పదే పదే కొరతకు దారితీస్తున్న పరిస్థితులను చక్కదిద్దడం. నీటి ఉపరితల, భూగర్భ, నీటిపారుదల, తాగునీటి విభాగాల మధ్య అంతంతమాత్రంగా ఉన్న సమన్వయాన్ని పెంపొందించడం చాలా అవసరం. వివిధ రాష్ట్రాల మధ్య నీటి పంపిణీ సర్దుబాట్లకు నీటి కొరత ఏర్పడ్డప్పుడు తగాదాలకు దారితీస్తుంటాయి. వీటికి నికరమైన పరిష్కారం చూపడం కేంద్రం బాధ్యత. వర్షపు నీటిని ఒడిసిపట్టడం అనేది జాతీయస్థాయిలో చూస్తే కేవలం కాగితాలకే పరిమితం అని చెప్పాలి. సమస్య ఎదురైనప్పుడు చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా ఉరుకులాడడం, ఆ తర్వాత చల్లబడిపోవడం మన దేశంలో సర్వసాధారణ విషయమైపోయింది. పైన తెలిపిన దీర్ఘకాలిక పరిష్కారాలు కేంద్ర, రాష్ట్రాల సమన్వయంతోనే ఒక కొలిక్కి వస్తాయని చెప్పక తప్పదు.

ఆ విమర్శలకు అర్థమేమిటి?

ఎన్నికలలో ఎదురుదెబ్బల దరిమిలా ముందు అనుకున్న విధంగానే ప్రధాని మోదీపై ఆరెస్సెస్ విమర్శలు మొదలయ్యాయి. ఆ సంస్థ సర్ సంఘ్ చాలక్ మోహన్ భాగవత్, ఫలితాలు వెలువడిన ఆరు రోజుల తర్వాత 10వ తేదీన నాగ్‌పూర్‌లోని తమ ప్రధాన కార్యాలయంలో సంస్థ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ, మోదీని ఉద్దేశించి ప్రత్యక్ష, పరోక్ష వ్యాఖ్యలు అనేకం చేశారు. మోదీ 2001లో గుజరాత్ ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి ఈ 23 సంవత్సరాల సుదీర్ఘకాలంలో ఆయనపై ఆరెస్సెస్‌కు విమర్శలు లేకపోలేదు. కాని అవి అంతర్గతంగా సాగాయి. అందుకు భిన్నంగా బహిరంగ విమర్శలు చేయటం ఇది మొదటిసారి కావటం గమనించదగ్గది. అంతేకాదు, అట్లా విమర్శించిన ప్రసంగాన్ని వీడియో రికార్డు చేసి బయట ప్రచారం కానివ్వటం మరొక విశేషం. అదే సమయంలో, మోదీని భాగవత్ విమర్శిస్తూ ప్రస్తావించిన అంశాలలో కనీసం కొన్నింటికి స్వయంగా ఆరెస్సెస్ బాధ్యత కూడా ఉందన్నది గుర్తించాలి.

టంకశాల అశోక్

భాగవత్ ఏమని వ్యాఖ్యానించారనే దానితో పాటు, ఆరెస్సెస్ అధికార పత్రిక అయిన ఆర్గనైజర్‌లో వెలువడిన వ్యాసంలో ఏముందనే విషయం ముందుగా చెప్పుకొని, ఆ తర్వాత చర్చలోకి వెళదాము. భాగవత్ మాటలు ఈ విధంగా ఉన్నాయి: 1.పనులు అందరూ చేస్తారు. కాని అందులో పద్ధతి, మర్యాద ఉండాలి. ఎన్నికలలో పోటీపడేవారు ఒకరినొకరు మించిపోవాలని చూడటం సహజం. కాని అందులోనూ మర్యాదలుండాలి. స్పర్థలుంటాయి గాని అది శత్రుత్వం కాదు. పార్లమెంటులో అంతా కలిసి పని చేయవలసి ఉంటుంది. కాని ప్రచారంలో శత్రుత్వం వచ్చింది. చివరికి సంఘ్ పరివార్ పేరు కూడా అందులోకి లాగారు. 2.ప్రచారంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని దురుపయోగం చేశారు. అసత్యాల ప్రచారం కోసం ఉపయోగించారు. ఇట్లాగైతే దేశం ఎట్లా నడుస్తుంది? 3.ఎన్డీయే ప్రభుత్వం మూడవ సారి ఏర్పడింది. మనం అనేక విధాలుగా ముందుకుపోతున్నాం. అయినా సమస్యలున్నాయి. అభివృద్ధి పట్ల దృష్టి సరిగా ఉండాలి. దృష్టి మారాలి. 4.మణిపూర్ ఏడాదిగా శాంతికోసం చూస్తున్నది. ఆ సంగతి ఎవరు పట్టించుకుంటారు? ఆ సమస్యకు ప్రాధాన్యం ఇవ్వాలి. 5.మనది వైవిధ్య సమాజం. అయినా అది భిన్నత్వంలో ఏకత్వం. ఆ స్థితిని ఆమోదించాలి. లోగడ ఎప్పుడో, ఎవరో బయటి నుంచి రావటం, ఇక్కడ మన ప్రజల మతాంతరీకరణ జరగటం వంటివన్నీ గడిచిపోయిన దశ. ఈ స్థితిని మనం ఆమోదించాలి. ఇతరుల మార్గాలను గౌరవించాలి. అదే ధర్మం. కూర్మ పురాణంలోనూ ఇదే చెప్పారు. కాని మనం దాన్ని విస్మరించాము. అన్ని మతాలు సమానం. ఈ దేశ సంతానమంతా మన సోదరులే. వారితో కలసిమెలసి ఉండాలి. విభేదాలను పూర్తిగా వదిలివేయాలి. They should go out lock stock and barrel. భవిష్యత్తు గురించి ఆలోచించాలి. 6.మాటల చాతుర్యంతో ఎన్నికలు గెలవటం కాదు, దేశం ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టిపెట్టాలి.

37 నిమిషాల పాటు సాగిన భాగవత్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఇవి. ఇదిగాక, ఆర్గనైజర్ పత్రిక వ్యాసాన్ని గమనించినప్పుడు, అందులోని వ్యాఖ్యలు మరింత సూటిగా, పదునుగా కన్పిస్తాయి. అవి ఈ విధంగా ఉన్నాయి. 1.మితిమీరిన విశ్వాసంతో ఉన్న బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు ఎన్నికల ఫలితాలు వాస్తవ పరిస్థితులను తెలియజేశాయి. 2. పార్టీ నాయకులు చాలామంది మోదీ ప్రభలో వెలిగిపోతున్నామనే భ్రమలో ఉన్నారు తప్ప వీధులలోని సామాన్యులు చెప్పేది వినటం లేదు. గాలి బుడగను నమ్మి మోదీపై ఆధారపడ్డారు. 3.అంకితభావంతో పనిచేసే సంఘ్ పరివార్ స్వయం సేవకులను, కార్యకర్తలను విస్మరించి సోషల్ మీడియా వారికి ప్రాధాన్యం ఇచ్చారు. క్షేత్రస్థాయిలో పని వల్ల లక్ష్యాలను చేరవచ్చు తప్ప సోషల్ మీడియాలో సెల్ఫీల వల్ల కాదు. 4.మొత్తం 543 నియోజకవర్గాల్లోనూ మోదీయే పోటీ చేస్తున్నట్టు భావించి ఓటు వేయాలనే ప్రచారం సరి కాదు. 5.స్థానిక నేతలను తక్కువ చేసి ఫిరాయింపుదారులకు టికెట్లివ్వటం పొరపాటు. 6.మహారాష్ట్రలో అధికారం కోసం అక్కడి పార్టీలను చీల్చటం వంటివి తప్ప నిర్ణయాలు.

బీజేపీ మాతృ సంస్థ అయిన ఆరెస్సెస్, దాని అధికార పత్రిక అయిన 'ఆర్గనైజర్'ల నుంచి ఇటువంటి తీవ్రమైన విమర్శలు గతంలో ఎన్నడూ లేని స్థాయిలో రావటాన్ని ప్రధాని మోదీ ఏ విధంగా చూస్తుండవచ్చు? అది మనకు ఇతర వర్గాల ద్వారా లీక్ అయి బయటకు రావటం తప్ప నేరుగా తెలిసే అవకాశం లేదు. లోగడ వాజపేయి ప్రధానిగా ఉండినప్పుడు ఆయనకు, ఆరెస్సెస్‌కు మధ్య కొన్ని అంశాలలో భిన్నాభిప్రాయాలు తలెత్తాయి. అవి సామరస్యపూర్వకంగా సమసిపోయాయి తప్ప బహిరంగ విమర్శల స్థాయికి వెళ్లలేదు.

2004లో బీజేపీ ఓడినప్పుడు కూడా ఆ సంస్థ అందుకు కారణాలపై అంతర్గత చర్చలైతే చేసింది గాని వాజపేయి పద్ధతులను ఇట్లా విమర్శించలేదు. ఈసారి మోదీ నాయకత్వాన అసాధారణమైన రీతిలో మూడవ సారి అధికారానికి వచ్చినప్పటికీ

సంఘ్ పరివార్ పలు కారణాల వల్ల ఆయనపై తీవ్ర అసంతృప్తితో ఉండటం గమనించదగిన విశేషం.

ఇందుకు కారణం ఎన్నికల ఫలితాలు ఈ విధంగా ఉండటమేనా అన్నది ప్రశ్న. అట్లా తోచదు. ఎందుకంటే, మోదీకి 2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉండినప్పటి నుంచి కూడా వ్యక్తిగత ధోరణులు, అహంభావం, పార్టీ సీనియర్లను, జాతీయ పార్టీని చివరికి ఆరెస్సెస్‌ను కూడా కొన్ని సందర్భాలలో లెక్కచేయకపోవటం, తన అధికారమే పరమావధిగా వ్యవహరించటమనే లక్షణాలున్నట్లు విమర్శలున్నాయి. ఆ విధంగా ఏమేమి జరిగిందనే దానిపై పరిశోధనలు కూడా ఉన్నాయి. కాని, గుజరాత్‌లో వరుసగా మూడుసార్లు ఘన విజయం సాధించటంతో పాటు హిందూత్వ అజెండాను ముందుకు తీసుకుపోవటం, తర్వాత జాతీయస్థాయిలో రెండు మార్లు అపూర్వ విజయాలు, సంఘ్‌పరివార్ అజెండాలోని పలు అంశాల అమలు వంటి రికార్డుల దృష్ట్యా, పరివార్ నాయకత్వం మోదీ ఈ ధోరణులలో కొన్ని తమకు నచ్చకపోయినా ఇంచుమించు మౌనంగా భరించింది. పార్టీ సీనియర్ల నుంచి కూడా అదే కన్పించింది. మరొకవైపు ముఖ్యంగా దేవరస్ (1973-94) తర్వాత కాలం నుంచి సర్ సంఘ్‌చాలక్‌ల స్థాయి, శక్తి క్రమంగా తగ్గుతున్నాయనే అభిప్రాయం ఉన్నది. అంతే ముఖ్యంగా సంస్థ శ్రేణులు బీజేపీ అధికారంలో ఉండటం వల్ల లభించే లాభాలకు అలవాటు పడటం మొదలైందనే మాట సైతం వినిపించసాగింది. ఈ విధంగా అన్నివైపుల నుంచి గల పరిస్థితులు పరిగణనలోకి రావటం, ఆ పరిస్థితుల ప్రభావం కారణంగానే ఇంతకాలం మోదీ ఆడింది ఆట, పాడింది పాటగా సాగిపోయిందని భావిస్తే బహుశా పొరపాటు ఉండదు. ఈ 23 సుదీర్ఘ సంవత్సరాల మోదీ విజయరథానికి ఇప్పుడు కుదుపులు వస్తున్నట్టు స్పష్టమవుతుండటం వల్లనే పరివార్ నుంచి ఈ విమర్శలు మొదలైనట్లు భావించటం కూడా పొరపాటు కాకపోవచ్చు.

భాగవత్, ఆర్గనైజర్‌ల వ్యాఖ్యల విషయానికి వస్తే, అవి ప్రత్యేక విశ్లేషణలు లేకుండానే అర్థమవుతున్న మాటలు. కొంతకాలంగా సాగుతున్న చర్చోపచర్చలు, అదేవిధంగా ప్రస్తుత ఎన్నికల ఫలితాలు, మోదీ తీరు గురించిన అభిప్రాయాల నేపథ్యంలో ఎంతో విజ్ఞులుగా మారిన ప్రజలకు ఇందులో అర్థం చేసుకోలేనిదంటూ ఏమీ లేదు. అర్థం చేసుకోవలసింది మోదీ మాత్రమే.

ఆయన మాతృసంస్థ చేసిన బహిరంగ విమర్శలు ఆయనకు నర్మగర్భమైన హెచ్చరిక కావటంతో పాటు, తన భవిష్య వ్యవహరణకు, పరిపాలన తీరుతెన్నులకు స్పష్టమైన సూచనలు కూడా. మోదీ గుర్తించవలసిన మొట్టమొదటి విషయమది. అందుకు అనుగుణమైన సవరణలను ఆయన చేసుకోవలసి ఉంటుంది. పరివార్ నాయకత్వం నుంచి ఇటువంటి బహిరంగ విమర్శలు వెలువడినందున, తన పట్ల పరివార్ సంస్థల వైఖరిపై, బీజేపీ శ్రేణుల వైఖరిపై దాని ప్రభావం ఉండగలదని కూడా ఆయన తెలుసుకోవాలి.

ఇక ఆరెస్సెస్ విషయానికి వస్తే, జరిగిన, జరుగుతున్న దాని పట్ల విమర్శలకు ఆ సంస్థ అతీతమేమీ కాదని పైన అనుకున్నాము. తిలా పాపం తలా పిడికెడు అనే సామెత వంటి స్థితి ఇది. తాము ఇపుడు ఆక్షేపిస్తున్న మోదీ ధోరణులను, సామాన్యులకు సరిపడని పరిపాలనా తీరుతెన్నులను మార్చించగల శక్తి సంఘ్ పరివార్‌కు ఇన్ని సంవత్సరాల పాటు నిజంగానే లేకపోయిందని నమ్మగలమా? వందేండ్ల నుంచి గల అంతటి మహా సంస్థ, అంతటి దీర్ఘకాలికమైన మహత్తర లక్ష్యాలు గల సంస్థ, రాజకీయాధికారం కన్న చరిత్రకు, సంస్కృతీ సంప్రదాయాలకు, నైతికతకు, క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇచ్చే సంస్థ, మోదీ వంటి ఒక ఆభాసను నియంత్రించకపోవటం, లేదా నియంత్రించ లేకపోవటం ఎందువల్ల జరిగినట్లు? ఇవి ఆ సంస్థ తనకు తాను సమాధానాలు చెప్పుకోవలసిన ప్రశ్నలు. తమ కార్యకర్తలకు, అనుయాయులకు ఇచ్చుకోవలసిన సంజాయిషీలు. భాగవత్ అన్నన్ని మౌలిక విషయాలను ప్రస్తావించటం వరకు బాగానే ఉన్నది గాని, మోదీ ఆధ్వర్యాన పెచ్చరిల్లిన పలు వైపరీత్యాలకు అవకాశమిచ్చిన సూత్రీకరణలు స్వయంగా తమ సిద్ధాంతాలలోనే లేవనగలరా? అటువంటి స్థితిలో అందుకు సవరణలెప్పుడు?

చివరగా, మణిపూర్ ప్రస్తావన వచ్చింది గనుక రెండు మాటలు చెప్పుకోవాలి. ఎన్నికల ఫలితాల తర్వాత కూడా అక్కడ సుమారు వంద ఇళ్ల దహనం జరిగింది. ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ వాహనశ్రేణిపై కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనల దరిమిలా కావచ్చు అక్కడ ఏడాదిగా శాంతి లేదంటున్న భాగవత్, ఆ విషయంపై మోదీని ఏడాదికాలంగా ఏమైనా ఒత్తిడి చేశారా? కనీసం ఒక్కసారైనా అక్కడకు వెళ్లనందుకు విమర్శించారా? కనీసం తమ సంస్థ పక్షాన అయినా శాంతి ప్రయత్నాలు చేశారా? గుర్తుకు రావటం లేదు. ఇంతకన్న ముఖ్యమైన ప్రశ్న ఒక్కటున్నది. ఈశాన్య భారతంలో క్రైస్తవ ప్రాబల్యం ఎక్కువ కావటం పట్ల ఆందోళన చెందే ఆరెస్సెస్, కొన్ని దశాబ్దాలుగా అక్కడ దృష్టిని కేంద్రీకరించి తమ సిద్ధాంతాలను వ్యాపింపజేస్తున్నది. ఆ పని ప్రజాస్వామికంగా, శాంతియుతంగా జరపటం వరకు ఆక్షేపించవలసింది లేదు. కాని ఆ క్రమంలో అనుసరిస్తున్న పద్ధతుల వల్ల పరస్పర ఘర్షణల పరిస్థితులు తలెత్తుతున్నాయి. నిజానికి మణిపూర్ అశాంతికి, హింసకు మూలాలు ఈ నేపథ్య పరిస్థితులలో ఉన్నాయి. ఇందుకు సవరణలు కూడా అవసరం కాదా? అంతిమంగా తేలుతున్నదేమంటే, మోదీ-పరివార్-ఆర్గనైజర్‌ల మధ్య ప్రస్తావనకు వస్తున్న విమర్శనాంశాలకు ఏదో ఒక మేర వారి ఉమ్మడి బాధ్యత ఉంది. పరిష్కార బాధ్యత కూడా ఉమ్మడిదే.

మోదీ టీమ్‌లో 'వారసత్వం.. నేరతత్వం'!

డా.కోలాహలం రామ్‌కిశోర్
98493 28496

సందర్భం ఉన్నా, లేకున్నా ప్రతిపక్షాలను ప్రధాని మోదీ విమర్శిస్తుంటారు. అది బహిరంగ సభనా? ఎన్నికల ప్రచారమా? లేదా పార్లమెంటా? అనేది ఆయనకు అనవసరం. విపక్షాలపై విరుచుకుపడటమే ఆయనకు తెలుసు. 2014 నుంచి మొదలుకొని తాజా సార్వత్రిక ఎన్నికల వరకు ఆయన ఇదే పద్ధతిని అవలంబించారు. అవినీతి, బంధుప్రీతి, వారసత్వ రాజకీయాలు ఆ విమర్శల్లో ప్రధానమైనవి. అయితే అలా విమర్శలు గుప్పించే ప్రయత్నంలో సొంత పార్టీ బీజేపీలో, ఎన్డీయే కూటమిలో అందరూ సత్యసంధులు, త్యాగధనులు, ఉత్తములే ఉన్నట్టు నీతి ప్రవచనాలూ వల్లిస్తుంటారు. వారసత్వానికి, బంధుప్రీతికి, నేర చరిత్రకు వారు అతీతులన్నట్టు పోజులు కొడుతుంటారు. కానీ, వాస్తవానికి బీజేపీ, ఎన్డీయే అందుకు అతీతమేమీ కాదన్నది జగమెరిగిన సత్యం.

మోదీ తన తాజా మంత్రివర్గంలో వారసత్వానికి పెద్దపీట వేశారనడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. ఆయన మాటలకు, చేతలకు చాలా వ్యత్యాసం ఉంటుందని మోదీ మరోసారి నిరూపించుకున్నారు. గతంలోనూ ఎంతోమంది పరివార్ నేతలకు మంత్రివర్గంలో చోటు కల్పించిన మోదీ.. ఈసారి కూడా అదే పంథాలో పయనించారు. మాజీ ప్రధాని దేవేగౌడ కుమారుడు కుమారస్వామి, కేంద్ర మాజీ మంత్రి మాధవరావు సింధియా కుమారుడు జ్యోతిరాదిత్య సింధియా, అరుణాచల్ ప్రదేశ్ స్పీకర్ రించిన్ ఖరు కుమారుడు కిరణ్ రిజిజు, మహారాష్ట్ర మాజీ మంత్రి ఏకనాథ్ ఖడ్సే కోడలు రక్ష ఖడ్సే, మాజీ ప్రధాని చరణ్‌సింగ్ మనవడు జయంత్ చౌదరికి తాజా మంత్రివర్గంలో స్థానం దక్కడం గమనార్హం. వారితో పాటు బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్ కుమారుడు రామ్‌నాథ్ ఠాకూర్, మాజీ కేంద్ర మంత్రి ఎర్రం నాయుడు కుమారుడు రామ్మోహన్ నాయుడు, మాజీ కేంద్ర మంత్రి వేద్ ప్రకాశ్ గోయల్ కుమారుడు పీయూష్ గోయల్, హర్యానా మాజీ మంత్రి రావు బిరేంద్ర సింగ్ కుమారుడు ఇంద్రజీత్ సింగ్‌కు మంత్రులుగా అవకాశం ఇవ్వడం తెలిసిందే. మరి వీరంతా పరివార్ నేతలు కాదంటారా? ఇదే విషయాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ 'ఎక్స్' వేదికగా ప్రస్తావించారు. మాటలకు, చేతలకు మధ్య వ్యత్యాసం ఉంటే.. ఆ వ్యక్తిని మోదీ అంటారని తీవ్రంగా విమర్శించారు.

ఈ నేపథ్యంలో మోదీ నూతన మంత్రివర్గంలో నేరచరిత్ర కలవారు, కోటీశ్వరుల జాబితాను ఏడీఆర్ తాజా నివేదికలో ప్రకటించింది. ఆ వివరాలను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

నేర చరిత్ర కలవారు: ఏడీఆర్ ప్రకారం.. మోదీ నూతన మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నవారిలో 28 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. వారిలో 19 మంది హత్యాయత్నం, మహిళలపై నేరాలు, విద్వేష ప్రసంగాలు.. వంటి తీవ్రమైన అభియోగాలను ఎదుర్కొంటున్నారు. ఇద్దరు మంత్రులపై హత్యాయత్నం ఆరోపణలున్నాయి. నౌకాశ్రయాలు, షిప్పింగ్, జలమార్గాల శాఖ సహాయ మంత్రి శంతనూ ఠాకూర్, విద్యా శాఖ, ఈశాన్య ప్రాంతాల అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సుభాంత మజుందార్‌పై ఈ కేసులున్నాయి. హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ఠాకూర్, మజుందార్, సురేష్ గోపి, ఓరంలు మహిళలపై వేధింపుల కేసులను ఎదుర్కొంటున్నారు. ఎనిమిది మంది మంత్రులపై విద్వేష ప్రసంగాల కేసులున్నాయని ఏడీఆర్ తెలిపింది. మొత్తం 71 మంత్రుల్లో 28 మంది (39 శాతం)పై క్రిమినల్ కేసులున్నాయని ఆ సంస్థ వెల్లడించింది.

కేంద్ర మంత్రులు-కోటీశ్వరులు: నూతన కేంద్ర మంత్రివర్గంలోని 71 మంది మంత్రుల్లో 70 మంది (99 శాతం) కోటీశ్వరులే. 71 మంది మంత్రుల సగటు ఆస్తులు రూ.107.94 కోట్లు. ఆరుగురు మంత్రులకు రూ.100 కోట్లకు పైగా ఆస్తులున్నాయి. టీడీపీ నుంచి లోక్‌సభకు ఎన్నికైన పెమ్మసాని చంద్రశేఖర్ మోదీ టీమ్‌లో అత్యంత ధనిక మంత్రిగా నిలిచారు. గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రిగా ఆయన బాధ్యతలు చేపట్టారు. కేంద్ర కమ్యూనికేషన్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా రెండో స్థానంలో, కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి మూడో స్థానంలో, రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ నాలుగో స్థానంలో, వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఐదో స్థానంలో నిలిచారు. ఎన్నికల అఫిడవిట్ల ఆధారంగా ఏడీఆర్ ఈ వివరాలను వెల్లడించింది.

తన టీమ్‌లోనే ఎంతో మంది పరివార్ నేతలను ఉంచుకొని ఇతరులపై దుమ్మెత్తిపోయడం ఏ మాత్రం సమంజసం కాదు. బంధుప్రీతి, వారసత్వ రాజకీయాలు, అవినీతి గురించి విమర్శించే ముందు మోదీ ఇకనైనా తన టీమ్‌లోనూ అలాంటి వారు ఉన్నారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. స్వపక్షంలోనే అలాంటివారిని పెట్టుకొని ఇతరులకు నీతులు చెప్పటం, చౌకబారు విమర్శలు చేయటంలో ఔచిత్యం లేదు. ముందు తమ పార్టీలో, మిత్రపక్షాల్లో ఉన్న లోపాలను సవరించుకొని ఇతరులపై విమర్శలు చేస్తే బాగుంటుంది. అప్పుడు ఆ మాటలకు విలువ కూడా ఉంటుంది.

రాజకీయ నాయకులు, విశ్లేషకులను 2024 సార్వత్రిక ఎన్నికల ఎగ్జిట్‌పోల్స్ విస్మయానికి గురిచేశాయి. అనైతిక ఆలోచనలతో ఎలాంటి విధివిధానాలు పాటించకుండా అసంబద్ధమైన లెక్కలతో ఎగ్జిట్‌పోల్స్‌ను ప్రకటించిన సర్వే సంస్థలు డీలా పడ్డాయి. వాటిని నమ్మిన స్టాక్‌మార్కెట్ కూడా ఒడుదుడుకులకు లోనైంది. అయితే వివిధ సంస్థలు సర్వే చేస్తున్న తీరుపై, వాటి విశ్వసనీయత, పారదర్శకతపై అనుమానాలు తలెత్తుతున్నాయి.

పారదర్శకత ప్రశ్నార్థకం

కన్నోజు శ్రీహర్ష

మన దేశంలో ఎన్నికలు చాలా భిన్నంగా ఉంటాయి. వివిధ రాష్ట్రాల్లో, వివిధ అంశాలు ఎన్నికలను ప్రభావితం చేస్తాయి. సాంకేతికత పెరిగిన తర్వాత డిజిటల్ మార్కెటింగ్ రూపంలో ఎన్నికల ప్రక్రియలో చాలా మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రచార శైలి మారింది. ఐవీఆర్ఎస్ పద్ధతిలో ప్రజల నాడిని రాజకీయ పార్టీలు తెలుసుకుంటున్నాయి. యూట్యూబ్ చానళ్ల ద్వారా ప్రజల అభిప్రాయాలు తెలుసుకోవడం సులభతరమైంది. ఈ నేపథ్యంలో సర్వేల రూపంలో కొత్త వ్యాపారం ప్రారంభమైంది. ప్రీ-పోల్, ఎగ్జిట్‌పోల్ పేరిట ప్రజల అభిప్రాయాలను సేకరించి వాటిని రాజకీయ పార్టీలకు, నాయకులకు చేరవేయడం పరిపాటిగా మారింది. ఇక్కడే అసలు సమస్య వస్తున్నది. ఒక పార్టీకి లబ్ధి చేకూర్చేలా, మరో పార్టీకి నష్టం జరిగేలా ఈ సంస్థలు సర్వే చేస్తున్నాయనే అనుమానం కలుగుతున్నది. ప్రజల నాడిని ఈ సంస్థలు నిజంగానే తెలుసుకుంటున్నాయా? నియోజకవర్గ, రాష్ట్ర, దేశ సమస్యలను ప్రస్తావించి ప్రజల అభిప్రాయాలను తీసుకుంటున్నాయా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఎన్ని శాంపిళ్లను తీసుకుంటున్నారనేది కూడా సందేహమే.

ప్రజల అభిప్రాయ సేకరణ అనేది నిబద్ధతతో జరగాలి. అనేక అంశాలపై ప్రజల అభిప్రాయాలను సేకరించాల్సిన అవసరం ఉన్నది. అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్), సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్ (సీపీఆర్) లాంటి సంస్థలు ఈ సర్వే సంస్థలకు దీనిపై గతంలో ఆదేశాలు జారీ చేశాయి. అయితే అందుకు భిన్నంగా కొన్ని అంశాలపైనే సర్వే సంస్థలు దృష్టి పెట్టడంతో ఎగ్జిట్‌పోల్స్‌కు,

వాస్తవ ఫలితాలకు మధ్య చాలా వ్యత్యాసం కనిపించింది. ప్రాంతీయ పార్టీల ప్రస్తావనే లేకుండా, రెండు జాతీయ పార్టీలే ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్టు సర్వే సంస్థలు పరిస్థితులను సృష్టించినప్పటికీ ప్రజలు ప్రాంతీయ పార్టీలను అక్కున చేర్చుకున్నారు.

లోక్‌నీతి, ఇండియా టీవీ, రిపబ్లిక్, సీ-ఓటర్ లాంటి ప్రఖ్యాత సర్వే సంస్థలు కూడా ఈ ఎన్నికల్లో ప్రజల నాడిని తెలుసుకోలేకపోవడం గమనార్హం. యూట్యూబ్ చానళ్లు, ఆన్‌లైన్ పోల్స్‌పై ఆధారపడటం, అతి తక్కువ శాంపిళ్లను సేకరించడమే అందుకు కారణం. క్షేత్రస్థాయిలో పరిస్థితిని అవి తెలుసుకోలేకపోయాయి. అందుకే దాదాపు అన్ని సంస్థలు ఎన్డీయే కూటమి 370-390 సీట్లు గెలుస్తుందని ప్రకటించాయి. కానీ, వాస్తవ ఫలితాలు పూర్తి భిన్నంగా వచ్చిన విషయం విదితమే.

సర్వే అంటేనే ప్రజల అభిప్రాయాలను ప్రతిబింబించాలి. అందుకు కనీసం నియోజకవర్గానికి 50 వేల నుంచి లక్ష వరకు శాంపిళ్లను సేకరించాలి. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, స్థానిక సమస్యలు, పర్యావరణం లాంటి అంశాలపై అభిప్రాయాలను సేకరించాలి. కేవలం ఏక నాయకత్వంపై కాకుండా నేతలు, కిందిస్థాయి కార్యకర్తల పని తీరు గురించి అడిగి తెలుసుకోవాలి. సర్వే గణాంకాలను మార్చకుండా వాస్తవ ఫలితాలను ప్రకటించాలి. తప్పుడు నివేదికలు ఇవ్వడం వల్ల స్టాక్‌మార్కెట్ నష్టాల రూపంలో దేశానికి నష్టం జరుగుతుం దనడంలో ఎలాంటి సందేహం లేదు.

లేఖ

అడ్మిషన్ల పేరిట ఫీజులుం

రాష్ట్రంలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు దోపిడికి తెరలేపాయి. అడ్మిషన్ల పేరిట ఫీజుల మోత మోగిస్తున్నాయి.